క్లుప్తంగా

రేపు క్రీడాదినోత్సవ ర్యాలీ

నారాయణపేట రూరల్: ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం క్రీడాదినోత్సవం నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ వెంకటేష్‌శెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మినీస్టేడియం గ్రౌండ్ నుంచి ఉదయం 6గంటలకు క్రీడా ర్యాలీ ప్రారంభమై అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగుతుందన్నారు. 10గంటలకు డీవైఎస్‌ఓ కార్యాలయ ఆవరణలో చలో మైదాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

జాతీయ కూచిపూడి పోటీలో విద్యార్థి ప్రతిభ



సాయి ఆశ్రీత్

నారాయణపేట: నవ్య నాట్య సమితి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ సరస్వతి పరిషత్ హాల్‌లో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కూచిపుడి నృత్యపోటీల్లో జిల్లాకేంద్రానికి చెందిన టీవీ, రెడియో గాయకులు సంగనర్సింహులు మనువడు సాయి ఆశ్రీత్, మనువరాలు సాయిఉత్తేజ్ ఎంపికయ్యారు. చిన్నారులు జాతీయస్థాయిలో రాణించడంతో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమాన సంఘం సంరక్షకులు నాగూరావు నామాజీ, లలిత కళానికేతన్ అధ్యక్షుడు సరాఫ్ కృష్ణ, సంగీత నిలయం అధ్యక్షుడు గోవర్ధన్‌శారీ అభినందించారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



దామరగిద్ద: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని క్యాతన్‌పల్లిలో వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం అర్చన, మహామంగళహారతి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ గౌరవ అధ్యక్షుడు వీరారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, నారాయణ, శరణప్ప, బస్వంత్‌రాజ్, అర్చకులు శరణయ్యస్వామి, శివకుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పట్టవా?



మాగనూర్: రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరి అంటూ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కొందరు పట్టించుకోవడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ముఖ్యంగా పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేని కారణంగా ఆటోలు, జీపులో ఎక్కువమందిని తరలిస్తూ నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఒక ఆటోలో నిబంధనల ప్రకారం ఆరుమంది ప్రయాణించాల్సి ఉంటుంది. ఒకేఆటోలో 15నుంచి 20మందిని తరలిస్తున్నారు. దీంతో అనుకొని ప్రమాదం జరిగితే భారీప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యతలేని సీసీరోడ్లు



చిన్నచింతకుంట: నాణ్యతా లోపంతో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టి అధికారులు నిధులు దుర్వినియోగం చేశారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామానికి గత సంవత్సరం సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ. కోటికి పైగా నిధులు మంజూరు చేసిందన్నారు. అధికారులు, సర్పంచ్ కుమ్మక్కై నాసిరకంగా రోడ్ల నిర్మాణం చేశారని అన్నారు. దీంతో ఏడాది గడవకముందే సీసీరోడ్లు దెబ్బతిన్నాయని అన్నారు. గతంలో పై అధికారులకు ఫిర్యాదు చేయగా నాణ్యత లోపంతో నిర్మించారని ధ్రువీకరించారని, నిధులను రికవరీ చేస్తామని చెప్పారన్నారు. కానీ నేటికీ చేయలేదని పేర్కొన్నారు. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఇప్పటికైనా నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు చూడాలన్నారు.

దేవరకద్ర: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా చేసుకుని పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేద్దామని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నంబిరాజు అన్నారు. ఆదివారం దేవరకద్ర మండల కేంద్రంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యజ్ఞభూపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ రమేశ్, మండల అధ్యక్షులు అంజన్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. క్రమశిక్షణ


మాగనూర్ జెడ్పీఉన్నత పాఠశాల ప్రార్థనలో విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం
- తెలుగు, హిందీ, ఆంగ్లంలో గేయాల ఆలాపన
- విద్యార్థులతో దినపత్రికలను చదివిస్తూ..

మాగనూర్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజూ ఉదయం ప్రార్థన విధానంలో మార్పులు వచ్చాయి. విద్యార్థుల గేయాల ఆలాపనతోపాటు పలు మార్పులు చోటు చేసుకున్నాయి. విజ్ఞానంతోపాటు క్రమశిక్షణ, పద్ధతి అలవర్చుకునేలా ప్రార్థన అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వందేమాతరంతో జాతీయ, రాష్ట్రగీతాలు, జనగణమన, జయజయహే తెలంగాణ తదుపరి ప్రతిజ్ఞ ప్రాముఖ్యతను సంతరించుకుంది. సోమ, మంగళవారాల్లో (తెలుగులో), బుధ, గురువారాల్లో (హిందీ), శుక్ర, శనివారాల్లో (ఆంగ్ల) ప్రార్థన నిర్వహిస్తున్నారు.

సమాచార స్రవంతి..

ప్రతిజ్ఞ ముగియగానే విద్యార్థులు పలు విజ్ఞాన విషయాలు నేర్చుకోవడానికి ప్రార్థనకు ఉపయోగపడుతోంది. ప్రతిరోజూ విద్యార్థితో తెలుగు, ఆంగ్లంలో దినపత్రికల్లో వచ్చిన వార్తలు చదివిస్తారు. దీనిలో రెండు అంతర్జాతీయ, రెండు జాతీయ, రాష్ట్రానికి చెందినవి రెండు, జిల్లాకు చెందిన రెండు ముఖ్య విషయాలను చదివిస్తున్నారు. ముఖ్యంగా శాస్త్రవేత్తలు, కనుగొన్న ఆవిష్కరణలు, ప్రపంచ వింతలు, గ్రంథాలు వాటి రచయితలు, దేశ ప్రముఖులు ఇలా పలు ఆంశాల ప్రశ్నలు ఉంటున్నాయి.


వ్యాయమం చేస్తున్న విద్యార్థులు

ప్రతిరోజూ ప్రాముఖ్యత గురించి..

చరిత్రలో ప్రతిరోజూ ఒక్క ప్రాముఖ్యత ఉంటుంది. చరిత్రలో జరిగిన సంఘటనలు నుంచి మొదలు జాతీయ నాయకులు, శాస్త్రవేత్తలు జయంతి లేదా వర్ధంతి ఆవిష్కరణ, ఉద్యమం విశిష్టతలు ఇందులో ఉంటాయి. వీటిని హెచ్‌ఎంలు కాని సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రతిరోజూ ఆంశాలపై వివరిస్తారు.

నిత్యం నల్లబల్లపై నమోదు..

ప్రతిరోజూ ప్రార్థనలో జరిగిన విషయాలను పాఠశాల ఆవరణలో ఉన్న బ్లాక్‌బోర్డుపై నమోదు చేస్తారు. నిన్నటి ప్రశ్ననేటి జవాబు చెప్పిన విద్యార్థిపేరు, సూక్తి ఆ రోజూ ప్రత్యేకత. ఇలా అన్ని విషయాలను నమోదుచేస్తారు. వీటిని వారితో పదే పదే చదవడం ద్వారా వారిలో జ్ఞాపకశక్తి పెంపొందే అవకాశం ఉంది.

నిత్యం కొత్తగా..



ప్రతిరోజూ ఉదయం పాఠశాలకు రాగానే నిర్వహించే ప్రార్థనలో కొత్త విషయాలు నేర్చుకుంటున్నాం. సమయ పాలన పెంపొందడంతో పాటు వేదిక మీద మాట్లాడే భయం పోతుంది. రోజూ కొత్తవిషయాలు నేర్చుకుంటున్నామనే భావన కలుగుతోంది.

– నిర్మల, పదోతరగతి విద్యార్థి, మాగనూర్

ఎంతో ఉపయోగంగా..



ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే ప్రార్థనతో ఎంతో ఉపయోగం ఉంది. ముఖ్యంగా విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవడంతోపాటు ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకోవడం జరుగుతుంది. ఉదయమే ప్రశాంత వాతావరణం లభిస్తుంది. తరగతిగదులో పాఠాలు వినేందుకు ఇష్టం ఏర్పడుతుంది.

– లక్ష్మీనారాయణ, పదోతరగతి విద్యార్థి, మాగనూర్

భాషా నైపుణ్యం పెరుగుతోంది..



ప్రార్థన సమయంలో విద్యార్థులు పత్రికల్లో వచ్చేవార్తలు చదవడం నమోదు చేయడంతో భాషానైపుణ్యం పఠనా సామర్థ్యం పెరుగుతుంది. విజ్ఞానాన్ని ఎంతో సులభంగా అర్థం చేసుకోవడానికి వీలుంది. ప్రతిరోజూ కొత్త విషయాలు చెప్పడం తో విద్యార్థులకు అసెంబ్లీ ఎంతో ఉపయోగపడుతోంది.

– నర్సింహులు, హెచ్‌ఎం, మాగనూర్

ముమ్మరంగా ఓటరు నమోదు


మాగనూర్‌లో ఓటునమోదు చేస్తున్న బీఎల్‌ఓలు

మాగనూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో బీఎల్‌ఓల ఆధ్వర్యంలో ఓటర్ నమోదు పక్రియ జోరుగాసాగింది. 18సంవత్సరాలు నిండిన యువత ఓటర్ నమోదుకోసం రావడమే గాక గ్రామంలో స్వయంగా వెళ్లి ఓటు హక్కు గురించి వివరించి, ఓటుహక్కు నమోదు చేసుకునేందుకు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఓటు అనేది రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అన్ని దానిని సరైన తీరుగా వినియోగించుకుని సరైన వారికి ఓటువేయాలని సూచించారు. కార్యక్రమంట బీఎల్‌ఓలు సురేష్, నర్సింహులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.


ఎల్లంపల్లిలో..

నర్వ: ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాన్ని ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించారు. రెండురోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో గ్రామాల్లో ఓటు నమోదు చేపట్టనున్నట్లు తహసీల్దార్ రాజగణేష్ పేర్కొన్నారు. ఈ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కేంద్రాల వద్ద ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్‌లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి భూమిపూజ


ఇంటినిర్మాణానికి భూమిపూజచేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మాగనూర్: మండలంలోని అమ్మపల్లిలో పుండికూర నర్సమ్మ అనే మహిళకు చెందిన ఇళ్లువర్షాలతో కూలిపోవడంతో వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి వలంటరీల ద్వారా సమాచారం అందుకుని గతంలో తక్షణ సాయంగా నిత్యావసర సరకులతోపాటు, కొంతమేర ఆర్థికసాయం అందించారు. సదరు మహిళకు ఇచ్చినమాట మేరకు ఆదివారం రూ.70వేలతోపాటు ఇంటిని నిర్మించడం కోసం సామగ్రిని అందజేస్తానని తెలిపారు. అందులో భాగంగా ఆయన ఇంటినిర్మాణానికి భూమిపూజ చేశారు. దీంతో నర్సమ్మ, గ్రామస్తులు ఆయనను ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వీజేఆర్ ఫౌండేషన్ వలంటరీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మద్దూరు: మీ సేవా నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని నిర్వాహకులు ఆదివారం రాష్ట్రఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ సలీంకు మండలంలో వినతిపత్రం అందజేశారు. మీ సేవా నిర్వాహకులకు, కుటుంబ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్, కమిషన్ పెంపు, గతంలో లాగా బ్యాంకునుంచి రైతులు రుణం పొందేదుకు ఆర్‌ఓఆర్ సర్వీసెస్ పునరుద్ధరించడం, ధరణి సేవలు మీసేవాలో మాత్రమే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వహకులు కంరోద్దీన్, రాంగోవిందు, ఖాసీం, వెంకటేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


సలీంకు వినతిపత్రం అందజేస్తున్న మీసేవా నిర్వాహకులు

విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు..


మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

మరికల్: విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో ఓడించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దచింతకుంటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో బాలికల జూనియర్ కళాశాల, ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాల, మరికల్‌లో జూనియర్ కళాశాల, ఐటీఐ, పాలిటెక్నికల్ కళాశాలను తీసుకురాలేకపోయారని విమర్శించారు. కళాశాలలు ఉన్న మండలాల్లో భవనాలు శిథిలావస్థకు చేరిందన్నారు. విద్యార్థులపై ఎమ్మెల్యేకు సానుభూతి లేకనే పక్క జిల్లాలకు వెళ్లి విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే 9 ఏళ్ల పాలనలో కేవలం రైతుబంధు, గొర్రెల పంపిణీ, పింఛన్లు తప్ప ఆయన చేసిందేమి లేదన్నారు. పేట అభివృద్ధిని విస్మరించిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో పోటీచేసే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు హర్షరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..



మద్దూరు: మండలంలోని చింతల్‌దిన్నే గ్రామానికి చెందిన కాంగ్రెస్ వార్డు సభ్యుడు నీలప్ప అతడితో పాటు మరో 60మంది యాదవులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నివాసంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమంకోసం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆశప్ప, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండ శ్రీహరి సంకీర్తన పారాయణం


శ్రీహరి సంకీర్తన పారాయణంలో భక్తులు

నారాయణపేట: పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకని ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలాజీ మందిర్‌లో మహేశ్వరి సమాజ్ ఆధ్వర్యంలో శ్రీహరి అఖండ సంకీర్తన పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పుష్పాభిషేకం, నైవేద్యం, మహమంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రేమలత లహోటి, పుష్పలత, లక్ష్మీదేవి ధరక్, గోదావరి, యశోధ కాంత, శాంత, పుష్ప, సునీత, రచన, తృప్తి, హేమ బట్టడ్, శశిసబిత, పద్మ సుమిత్ర, సరిత ఆరతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులను సన్మానిస్తున్న నర్సింహాగౌడ్

మక్తల్: జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా పట్టణంలో జెడ్పీబాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం క్రీడాకారులకు అథ్లెటిక్స్ చైర్మన్ నర్సింహాగౌడ్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు పూర్తిస్థాయిల్లో సహకరించిన రిటైర్డ్ పీఈటీ గోపాల్‌ను అభినందించారు. కార్యక్రమంలో రామలింగం, బండారి ఆనంద్, అంబాదాస్, రామేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే ధర్మం

మక్తల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవ ధర్మమని బీకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలకిష్టారెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలో ఊట్కూర్‌కు చెందిన భాగ్యశ్రీ అనారోగ్యంతో బాధపడుతుంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమె చికిత్సపొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన ఆస్పత్రికి వెళ్లి ఆర్థికసాయంగా రూ. 40 వేల చెక్కును కుటుంబానికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బీకేఆర్ ఫౌండేషన్ నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో పలుగ్రామాలను సందర్శించి పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు పరిశీలించి ప్రజలకు సౌకర్యాలను ఏర్పాటుచేసేందుకు తనవంతు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిటిజన్ క్లబ్‌సేవలు విస్తృతం చేయాలి


సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న నిర్వహకులు

నారాయణపేట: సిటిజన్‌క్లబ్ సేవలు విస్తృతం చేయాలని అందరూ ఉపయోగించుకునేలా వసతులు కల్పించాలని క్లబ్‌సీనియర్ సభ్యులు నాగూరావు నామాజీ, క్లబ్ ఉపాధ్యక్షుడు ఎల్.మనోహర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. ఆదివారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతిపురాతమైన సిటిజన్‌క్లబ్‌ను పరిరక్షించుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ అన్నివిధాలుగా సహకరించి క్లబ్‌ను అభివృద్ధిచేయాలన్నారు. అలాగే క్లబ్ నిర్వహణకోసం శాశ్వత ఆదాయ వనరులకోసం క్లబ్ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని, అందుకోసం ఎంపీ, ఎమ్మెల్యేల సహకారం తీసుకుందామని తెలిపారు. క్లబ్ అభివృద్ధికి వనిత ఆతస్పత్రి డాక్టర్ మోహన్ రూ. 50వేల విరాళం ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక..

సిటిజన్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడు ఎల్. మనోహర్‌ప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, కార్యదర్శి కెంచి గోపాల్, నిర్వాహణ కార్యదర్శి వెంకట్రాములు, కో–శాధికారి మల్లికార్జున్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు సుదర్శన్‌రెడ్డి, సుధాకర్, ఓంప్రకాశ్, రఘువీర్‌యాదవ్, చెన్నారెడ్డి, లక్ష్మీపతిగౌడ్, గోవిందప్ప పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ధన్వాడ: మండలంలోని గోటూర్ ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1975–76 బ్యాచ్‌చెందిన విద్యార్థులు పాఠశాలలో అందరూ కలిసి పాఠశాల రోజులను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహాయం చేయాలని నిర్ణయించారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిన్నచింతకుంట: మద్దూర్ గ్రామంలోని ఊకచెట్టు వాగు నుంచి ఆదివారం తెల్లవారుజామున రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొన్న పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో చర్యలు తీసుకున్నారు. ట్రాక్టర్ యాజమానులు దామోదర్, విజయ్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

పందులతో పరేషాన్!

అమరచింత: పట్టణంలోని కాలనీల్లో నిత్యం పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలను రోగాల పాలు చేస్తున్నా వాటిని తరలించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పట్టణంలోని 10 వార్డుల్లో నిత్యం సంచరిస్తూ పాదచారులు తీసుకెళ్తున్న కూరగాయల సంచులను లాక్కొని వారిని గాయపర్చేందుకు పాల్పడుతున్నాయి. పందుల పెంపకం దారులను పిలిచి వాటిని తరలించమని చెప్పలేని స్థితిలో పాలక యంత్రాంగం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాధనం వృథా..


ఆత్మకూర్ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద వృథాగా రిక్షాబండి

ఆత్మకూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ్‌భారత్ మిషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో చెత్తను సేకరణకు ఏర్పాటు చేసిన చెత్తబండి రిక్షాలు నిరుపయోగంగా తుప్పుబట్టి మూలన పడ్డాయి. ఆత్మకూర్ మండలంలో ఆరేపల్లి, ఆత్మకూర్, తిప్పంపల్లి, దేవరపల్లి, రేచింతల, తూంపల్లి, కత్తేపల్లి, బాలకిష్టాపూర్ గ్రామాల్లో చెత్త సేకరణ రిక్షాలను గ్రామ పంచాయతీలకు అందించారు. కార్మికుల కొరత ఉండడంతో రిక్షాలు నిరుపయోగంగా మారాయి. ఆత్మకూర్ మున్సిపాలిటీలో చెత్త సేకరణకు ట్రాక్టర్లు, ఆటోలు ఉండటంతో రిక్షాలను పట్టించుకోవడం లేదు.


మున్సిపాలిటీ కార్యాలయం వద్ద వృథాగా రిక్షా

ట్రాక్టర్లను వినియోగిస్తున్నాం..



స్వచ్ఛ్‌భారత్ మిషన్‌లో భాగంగా గ్రామాల పరిశుభ్రత కోసం ఏర్పాటు చేసిన రిక్షాలు కార్మికుల కొరత వల్ల ఉపయోగించడం లేదు. ప్రతి గ్రామ పంచాయతీకి చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం ట్రాక్టర్లను కేటాయించింది. ప్రతిరోజూ ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ, ఆత్మకూర్

వెలగని విద్యుత్ దీపాలు

అమరచింత: ఉమ్మడి జిల్లాకు వరప్రదాయనిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రుల్లో అంధకారం ఉంటోంది. డ్యాం పరసరాలు, రహదారి చీకటిగా మారుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. జూరాల నీటితో జెన్‌కో అధికారులు విద్యుత్ ఉత్పత్తి ఇక్కడి నుంచే చేస్తున్నా ప్రాజెక్టుపై మాత్రం వెలుగులకు నోచుకోవడం లేదు. విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు అలంకార ప్రాయంగా మారాయి. ప్రాజెక్టు అధికారులు పట్టించుకొని రాత్రి సమయంలో వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, పర్యాటకులు కోరుతున్నారు.


జూరాల ప్రాజెక్టుపై వెలగని విద్యుత్ బల్బులు